సాక్షి నిర్మల్

సోమవారం । 19 । మే । 2025



బాసరలో భక్తుల రద్దీ

ఆదివారం సెలవు దినం కావడంతో బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయానికి భక్తులు పోటె త్తారు. క్యూలైన్లలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. 8లో▸



వనమహోత్సవానికి సన్నద్ధం

అడవుల విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసి వివిధ మొక్కలు పెంచుతోంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /26.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అడెల్లికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, అమ్మవారి సేవాదారులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ప్రతిభ కళాశాలలకు ఎంపిక



ఈశ్వర్



గౌతమ్

ఖానాపూర్: మార్చి, ఏప్రిల్‌లో రెండు విడతల్లో నిర్వహించిన ప్రతిభ కళాశాలల ప్రవేశ పరీక్షల్లో పట్టణంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రవేశానికి ఎంపికయ్యారు. వరంగల్, పాల్వంచలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయా పాఠశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు జాదవ్ ఈశ్వర్, భూక్యా గౌతమ్ ప్రవేశ పరీక్ష రాసి ప్రతిభ కనబరిచారు. ఈశ్వర్ పాల్వంచ కళాశాలలో ఎంపీసీ విభాగానికి, గౌతమ్ వరంగల్ కళాశాలలో బైపీసీ విభాగానికి ఎంపికైనట్లు ఖానాపూర్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఏ గఫార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డీటీడీవో అంబాజీ నాయక్, ఏసీఎంవో శివాజీ, స్పోర్ట్స్ అధికారి భూక్యా రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి నిర్వహించారు. పల్లకీసేవ నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, ఇస్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో వచ్చిన భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. నైవేద్యంగా బోనాలు సమర్పించారు. చిన్నపిల్లల తలనీలాలు సమర్పించి తులాభారం (బంగారం)తో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

ఇండియా తైక్వాండోకు అధికారిక గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న తైక్వాండో క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: ఇండియా తైక్వాండో క్రీడను భారత యువజన, వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ అధికారికంగా గుర్తించిందని తైక్వాండో అసోసియేషన్ నిర్మల్ సెక్రటరీ దయాత్ అక్షయ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోచింగ్ సెంటర్‌లో తైక్వాండో క్రీడాకారులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తైక్వాండోపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సభ్యులు మహేశ్వర్, జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు విపత్తు

జిల్లాలోని ఓ మండలకేంద్రంలోగల ఉన్నతపాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు అనుమానం వచ్చి ఉపాధ్యాయులు పరిశీలించారు. వారి వద్ద మత్తుమందు సిగరెట్లు దొరికాయి.

ఏడాది క్రితం.. జిల్లాకేంద్రం నుంచి సారంగపూర్ వైపు వేగంగా బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కిందపడిపోయి ఇద్దరు యువకులు దారుణంగా చనిపోయారు. ఇందుకు వారిద్దరూ అధిక మోతాదులో గంజాయి సేవించడమే కారణమని నిర్ధారణైంది.

తాజాగా జిల్లాకేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో పనిచేసే ముగ్గురు ల్యాబ్/ఎక్స్‌రే టెక్నీషియన్‌లు, ఓ యువకుడు శస్త్రచికిత్సల సమయంలో పేషెంట్లకు ఇచ్చే మిడాజోలం అనే మత్తుమందు ఇంజెక్షన్‌లను యువతకు ఇస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.



జిల్లాకేంద్రంలో ఇటీవల నలుగురు యువకుల మధ్య జరిగిన గొడవలో ఒకరు మద్యం సీసా పగులగొట్టి తన మిత్రుడి గొంతుభాగంలో పొడుస్తూ ఉన్నాడు. 'అరె.. నాకు రక్తం వస్తుందిరా..' అని వాడు చెబుతున్నా ఆగడం లేదు. బాధితుడూ అక్కడి నుంచి తప్పించుకోవడం లేదు. పక్కనున్న మిత్రులూ ఆపడం లేదు. ఎందుకంటే.. వాళ్లంతా గంజాయి మత్తులో ఉన్నారు. వారేం చేస్తున్నారో.. అక్కడేం జరుగుతుందో.. కూడా వారికి అర్థం కావడం లేదు.

- జిల్లాలో గంజాయి భూతం..!
- బడిపిల్లలూ వ్యసనానికి అడిక్ట్
- 'కొత్త మత్తు'తో యువత చిత్తు
- నిర్వీర్యమవుతున్న భావితరం

నిర్మల్: జిల్లా 'భవిత' ఆందోళనకర పరిస్థితుల్లో ఉంది. యువతరం భయంకరమైన 'మత్తు'లో కూరుకుపోతోంది. ఇప్పటికే 30–40శాతం యువత క్రమంగా గంజాయికి బానిసవుతోంది. టీనేజర్లను దాటి ఈ మత్తుమందు బడిపిల్లల చేతుల్లోకి చేరడం మరింత ఆందోళన కలిగించే విషయం. 'గమ్మత్తు'గా ఉంటుందంటూ యువత గంజాయి పీలుస్తూ.. తమ భవితను గాలికొదిలేస్తోంది. ఆ మత్తులో ఏం తప్పులు చేస్తున్నారో.. ఏమవుతున్నారో.. అన్న ఆలోచన ఉండటం లేదు. జిల్లాలో ఇప్పటికే గంజాయి కారణంగా చాలామంది యువకులు బానిసలుగా, బాధితులుగా మారారు. స్థానికంగా చికిత్స చేయిస్తే అందరికీ తెలిసిపోతుందని చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను నిజామాబాద్, హైదరాబాద్ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. మరోవైపు గంజాయితో పాటు కొత్తకొత్త మత్తుపదార్థాలను యువతకు ఎక్కిస్తూ.. సంపాదించే ముఠాలూ పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగించే విషయం.

బానిసలవుతున్న యువకులు

జిల్లాలో నాలుగైదేళ్ల నుంచి గంజాయి సేవించేవాళ్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రధానంగా యువకులు దీని బారినపడుతున్నారు. సరదాగా సిగరెట్‌తో మొదలయ్యే వ్యసనం ఇప్పుడు గంజాయి గుంజేదాకా వెళ్లింది. ఒక్కసారేనంటూ మొదలు పెట్టిన చాలామంది యువకులు ఇప్పుడు రోజుకు ఒక్కసారైనా లేకపోతే పరేషానవుతున్నారు. పొద్దున్నే అడ్డాల మీద వాలిపోతున్నారు. ఒకరిద్దరు తీసుకువస్తే మిగతా వాళ్లంతా ఆ మత్తును షేర్ చేసుకుంటున్నారు. మద్యం ఎప్పుడంటే అప్పుడు తాగడానికి వీలుకాకపోవడం, దానికి డబ్బులు ఎక్కువగా అవసరం కావడంతో యువత సులువుగా మత్తు వచ్చే గంజాయి వైపు మొగ్గు చూపుతున్నారు.

దందాగా మార్చుకుంటూ..

గంజాయి సేవించడం నుంచి మొదలై దాన్నే దందాగా మార్చుకుని ఈజీమనీకి అలవాటు పడుతున్న వాళ్లూ తయారవుతుండటం కలవరపెట్టే విషయం. మరోవైపు గంజాయిని మించి మత్తు ఇస్తుందంటూ ఇటీవల నలుగురు యువకులు డబ్బుల కోసం అనస్తీషియా మందునూ యువతకు ఎక్కించడం దారుణం. ఈ మత్తుమందు కాస్త అటుఇటు అయితే ప్రాణాలే పోతాయి. గంజాయి కట్టడికి పోలీసులు, ఇతర శాఖలు ప్రయత్నిస్తున్నా.. అనుకున్న స్థాయిలో ఫలితం సాధించలేకపోతున్నాయి.

మత్తుపై యుద్ధం చేయాల్సిందే..

యావత్ జిల్లాకు విపత్తులా మారిన మత్తుపదార్థాల బారి నుంచి యువతను కాపాడుకోవడం సమష్టి బాధ్యత అని, మత్తుపై యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఇటీవల ఎస్పీ జానకీషర్మిల సూచించారు. ఇందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వాస్తవ పరిస్థితుల నేపథ్యంలో ప్రతిఒక్కరూ సమష్టిగా కలిసి వస్తేనే గంజాయి భూతాన్ని జిల్లా నుంచి తరిమికొట్టవచ్చన్న వాదన అందరిలో పెరుగుతోంది.

సమష్టిగా పనిచేస్తేనే..



జిల్లాలో విస్తరిస్తున్న మత్తుపదార్థాలను అరికట్టాలంటే అందరి సహకారం అవసరం. ఎక్కడ గంజాయి గుప్పుమన్నా.. పోలీసులకు సమాచారమివ్వాలి. పోలీసుశాఖ తరఫునా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– జానకీషర్మిల, ఎస్పీ

పెరిగితే పరేషానే..



మత్తుపదార్థాల వాడకం పెరిగిన కొద్దీ అనర్థాలు పెరుగుతున్నట్లే. జిల్లాలో గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువత సంఖ్య పెరుగుతోంది. మత్తుపదార్థాలకు అడ్డుకట్ట వేయడం అందరి బాధ్యత.

– సురేశ్ అల్లాడి, జిల్లా మానసిక వైద్యాధికారి

ప్రయాణం ప్రాణసంకటం



నాటుపడవపై వెళ్తున్న ప్రయాణికులు



పిల్లర్ల దశలో నిలిచిన వంతెన పనులు (ఫైల్)

- కష్టాల్లో మారుమూల గ్రామాల ప్రజలు
- ఎన్నోఏళ్లుగా ప్రమాదకర ప్రయాణం

కడెం: స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా నేటికీ కడెం మండలంలోని మారుమూల గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీరడం లేదు. గంగాపూర్, రాణిగూడ, కొత్రతండాలకు రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు ఎటు వెళ్లాలన్నా కడెం బ్యాక్ వాటర్‌లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నాటుపడవలపై ప్రయాణిస్తున్నారు.

ఏళ్లుగా తీరని దారి కష్టాలు

మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో కవ్వాల్‌టైగర్‌జోన్‌లో దట్టమైన అడవిలోగల మారుమూల గ్రామాలైన గంగాపూర్, రానిగూడ, కొత్రతండా గ్రామాలకు ఎలాంటి రవాణా మార్గం లేదు. 2004లో అప్పటి సీఐ, ఎస్సై చొరవతో అటవీ ప్రాంతం నుంచి మట్టిరోడ్డు నిర్మించారు. అది ఆ సమయంలో గొప్ప విషయం కావడంతో పోలీస్ అధికారులకు అమెరికాలో సామాజిక సేవలో అవార్డులు కూడా వచ్చాయి. ఈ దారితోనే నేటికీ గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ ఈ గ్రామానికి రోజూ రెండు ట్రిప్పుల చొప్పున బస్సు నడిపిస్తున్నారు. అయితే వానాకాలంలో గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో ఇక బస్సు నాలుగు నెలల తర్వాత చలికాలంలో ప్రారంభమవుతుంది. బస్సు నడవని సమయంలో గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తారు. లేదా కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో నాటుపడవలపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తుంటారు. ఈక్రమంలో చాలాసార్లు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. గతంలో గ్రామం నుంచి 20 మంది ప్రయాణికులతో వస్తున్న జీపు అదుపు తప్పి బోల్తా పడగా 16 మందికి గాయాలయ్యాయి.

ధర్నాలు, రాస్తారోకోలు చేసినా..

రోడ్డు నిర్మాణం కోసం ఏళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు నాయకులు, అధికారులను కలిశారు. అయినా వీరి కష్టాలు పట్టించుకున్న నాథులే లేరు. గతంలో నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లో అప్పటి సీఎం కేసీఆర్ సభ నిర్వహించగా గ్రామ సర్పంచ్ శాంత భర్త చంద్రహాస్ సభాస్థలి ఎదుట ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఎక్కి గంగాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన తెలిపాడు. రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నికలు బహిష్కరించగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్న వెడ్మ బొజ్జు పటేల్, రాథోడ్ రమేశ్, జాన్సన్‌నాయక్ వంతెన నిర్మాణం చేపడతామని బాండ్ పేపర్లు రాసి హామీ ఇచ్చారు.

ముందుకు సాగని పనులు

రూ.10కోట్ల నిధులతో గతంలో వంతెన నిర్మాణం ప్రారంభించగా పిల్లర్ల దశలోనే కడెం ప్రాజెక్ట్‌లోకి వచ్చిన భారీ వరదలకు కొట్టుకుపోయింది. మళ్లీ వంతెన రీడిజైన్ చేశారు. రూ.22.15 కోట్ల అంచనాతో గతేడాది డిసెంబర్ 13న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్ పనులు ప్రారంభించగా, నేటికీ పిల్లర్ గుంతలు తోడే దశలోనే ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

గంగాపూర్ వంతెన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై నోటీసులు జారీ చేశాం. పనులు నెమ్మదించడానికి స్థానికంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– శంకరయ్య, పీఆర్ ఈఈ

వంతెన పూర్తి చేయాలి



ఏళ్లు గడిచినా మా ఊర్లకు దారి కష్టాలు తీరడం లేదు. వంతెన నిర్మాణ పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయించి మా దారి కష్టాలు తీర్చాలి.

– ఉర్వేత అనంత్‌రావు, లక్ష్మీపూర్

దారి కష్టాలు తీర్చాలి



గంగాపూర్ ఉమ్మడి జీపీ పరిధి గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతం గుండా మట్టి రోడ్డు మీదుగా ప్రయాణించాలి. వానాకాలంలో వాగులు పొంగి పొర్లితే గ్రామం దాటి బయటకు రాలేం. కొన్ని సమయాల్లో ప్రాణాలు పోయిన ఘటనలున్నాయి.

– దాసునాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

బీసీ గురుకుల 'సీవోఈ'

- ఉమ్మడి జిల్లాకు ఒకటి మంజూరు
- ఆదిలాబాద్ పరిధిలో లక్సెట్టిపేటలో బాలుర కళాశాల
- ఈ విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి..



లక్సెట్టిపేటలో ఏర్పాటు కానున్న సీవోఈ కళాశాల

ఆదిలాబాద్‌రూరల్: బీసీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఆంగ్లమాధ్యమంలో నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017లో మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11 పాఠశాలలను ఏర్పాటు చేశారు. అనంతరం వాటిని ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం వీటి సంఖ్య 22కు చేరింది. ఈ విద్యాసంవత్సరం నుంచి లక్సెట్టిపేటలో బీసీ సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) సైతం అందుబాటులోకి రానుంది. ఇక్కడి విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తుండడంతో ప్రవేశాలకు పోటీ పెరిగింది.

ఒక్కో సీవోఈలో 160 సీట్లు..

కొన్నేళ్లుగా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల పరిధిలో సీవోఈలు కొనసాగుతున్నాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోనూ హైదరాబాద్‌లో బాలురు, బాలికల సీవోఈలు ఒక్కొక్కటి చొప్పున నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా మరో 10 సీవోఈలను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన అందుబాటులోకి తెస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకుని రెండు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో బాలుర, నిజామాబాద్‌లో బాలికల సీవోఈలను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కోచోట ఎంపీసీలో 80సీట్లు, బైపీసీలో 80సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

శిక్షణ.. ఎంపిక

ఇందులో ఇంటర్మీడియట్‌తో పాటు జేఈఈ మెయిన్స్, నీట్, ఐఐటీ తదితర పోటీ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీటిలో ప్రవేశాలకు గాను 75 శాతం బీసీ విద్యార్థులకు, 25 శాతం ఇతరులకు కేటాయించనున్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో చదివిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

జిల్లాలో 22 బీసీ గురుకులాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 2017లో 11 మహాత్మా జ్యోతి బాపూలే గురుకులాలను ప్రారంభించగా ప్రస్తుతం వీటి సంఖ్య 22కు చేరింది. ఇందులో 11బాలికలు, 11బాలుర కళాశాలలున్నాయి. వీటిలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు గాను శనివారం వరకు దరఖాస్తులు ఆహ్వానించారు.

ఈ విద్యాసంవత్సరం నుంచి..



ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచి రెండు సీవోఈలు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో బాలుర సీవోఈ ప్రారంభం కానుంది. అలాగే నిజామాబాద్‌లో బాలికల సీవోఈ ఏర్పాటు కానుంది. ఒక్కోదానిలో 160 (ఎంపీసీ 80, బైపీసీ 80) సీట్లు అందుబాటులో ఉంటాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. – ఎస్.శ్రీధర్, మహాత్మాజ్యోతి బాపూలే గురుకులాల ఆర్‌సీవో

మళ్లీ.. 'మైక్రో' భూతం!

- ఆర్థికావసరాలున్న వారే టార్గెట్
- అధిక వడ్డీకి అప్పులిస్తూ దోపిడీ
- జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్న దందా
- ఇటీవల జిల్లాలో పెరిగిన ఫిర్యాదులు



నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మైక్రోఫైనాన్స్ బాధితులు (ఫైల్)



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మైక్రోఫైనాన్స్ బాధితులు (ఫైల్)

నిర్మల్: జిల్లాలో వివిధ పేర్లతో మైక్రోఫైనాన్స్ భూతం మళ్లీ కోరలు చాస్తోంది. ఎలాంటి అనుమతి లేకుండానే ఫైనాన్స్ నిర్వాహకులు దందా నిర్వహిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం ఇలాగే అధికవడ్డీలతో పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెట్టిన పలు ఫైనాన్స్ సంస్థలు కాస్త అటుఇటుగా పేర్లు మార్చుకుని పాతదందానే నడిపిస్తున్నాయి. ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ నిర్వాహకులు అధికవడ్డీ వసూలు చేస్తున్నారు. వాటిని కట్టలేక బాధిత కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. తాజాగా బాధితులు కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి తమగోడు వెల్లబోసుకున్నారు.

ఆర్థిక పరిస్థితి ఆసరాగా చేసుకుని..

మైక్రోఫైనాన్స్ కంపెనీలు ప్రజల ఆర్థికపరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్నాయి. ప్రధానంగా పేద, మధ్య తరగతి, నిరక్షరాస్య కుటుంబాలను కంపెనీల నిర్వాహకులు టార్గెట్ చేస్తున్నారు. చిన్నచిన్న అవసరాలు, శుభకార్యాలకూ చేతిలో పెద్దమొత్తం లేని వాళ్లే లక్ష్యంగా చూసుకుంటున్నారు. ఇలాంటి వారికి అప్పులు ఇస్తూ.. ఆ క్షణంలో ఆదుకుంటున్నట్లు బిల్డప్ ఇస్తున్నారు. ఆ తర్వాత సులభ వాయిదాలంటూ తేలికగా చెబుతూ.. అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. తీసుకున్న రుణానికంటే చెల్లించే వడ్డీలే ఎక్కువ అవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

గతంలోనూ దందా..

దశాబ్దం క్రితం మైక్రోఫైనాన్స్ దందా మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగింది. ఒక దశలో మైక్రోఫైనాన్స్ నిర్వాహకుల ఆగడాలు శృతిమించాయి. ఇళ్లల్లోకి వెళ్లి ఇష్టారీతిన వ్యవహరించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం మైక్రోఫైనాన్స్‌ల వేధింపులపై చర్యలు చేపట్టింది. దాదాపు పదేళ్లపాటు అంతగా కనిపించని ఈ ఫైనాన్స్‌లు ఈ మధ్యకాలంలో మళ్లీ ఊపందుకుంటున్నాయి. గ్రామాల్లోనే కాకుండా చిన్నపట్టణాల్లోనూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

గల్లీల్లో కార్యాలయాలు

బ్యాంకులు, ఫైనాన్స్‌లు సాధారణంగా వాణిజ్యపరమైన ఏరియాల్లో ఆఫీసులు నిర్వహిస్తుంటాయి. కానీ.. మైక్రోఫైనాన్స్‌లు అలా కాదు. పట్టణాల్లో ఎక్కడో మూలన, అంతగా జనసంచారం లేని ఏరియాల్లో వాటి నిర్వాహకులు కార్యాలయాలు తెరుస్తారు. రుణాలు ఇవ్వడం, వసూలు చేయడానికి నిరుద్యోగ యువతను ఎంపిక చేసుకుంటారు. వారిని నేరుగా గ్రామాలు, కాలనీలకు పంపిస్తున్నారు. కొన్ని మైక్రోఫైనాన్స్‌లు వ్యక్తిగతంగా, గ్రూపులుగా చేసి మరీ రుణాలు ఇస్తున్నాయి. అవసరానికి చేతికి డబ్బులు అందిస్తున్న తీరు బాగానే ఉన్నా ఆ సంస్థలు వసూలు చేసే వడ్డీలే సదరు కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. సకాలంలో వాయిదాలు చెల్లించని వారి ఇళ్లకు వెళ్లడం, దుర్భాషలాడుతున్న తీరుపై మళ్లీ ఫిర్యాదులు వస్తున్నాయి. తాజాగా గత సోమవారం జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన పలువురు బాధితులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రాలు అందించారు. తమను మైక్రోఫైనాన్స్‌ల నిర్వాహకులు వేధిస్తున్నారంటూ గోడు వెల్లబోసుకున్నారు.

ఎయిడ్స్ బాధితులకు భరోసానివ్వాలి



నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నిర్మల్: ఎయిడ్స్ బాధితులకు సమాజం భరోసానివ్వాలని వైద్యాధికారులు సూచించారు. ఎయిడ్స్‌తో మృతిచెందిన వారి స్మారకార్థం ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో 'అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం' నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, షుర్ ఎన్జీవో, లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ముందుగా కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ తీశారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, జిల్లా సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఎన్జీవో నిర్వాహకుడు మల్లికార్జున్, డబ్ల్యూఏస్ సూపర్‌వైజర్ శశిమాల, ఐసీటీసీ కౌన్సిలర్లు సుదర్శన్, రామచందర్, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మచైర్మన్‌గా రామ్‌రెడ్డి



రామ్‌రెడ్డి

నిర్మల్: ఆత్మ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రామ్‌రెడ్డితో పాటు డైరెక్టర్‌లు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రామ్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. తనపై నమ్మకంతో ఆత్మ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడికి రామ్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

అంబలి పంపిణీకి విశేష స్పందన

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపట్టిన ఉచిత అంబలి పంపిణీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసే పల్లికొండ జనార్దన్ పదేళ్లుగా సొంత డబ్బులతో ప్రతీ వేసవిలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో రోజుకు 200 లీటర్ల అంబలితో పాటు చల్లని తాగునీటి ఫ్రీజర్‌ను ఏర్పాటుచేసి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు అంబలి పంపిణీ చేస్తున్న జనార్దన్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ విలాస్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ చెరువు కట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై సుప్రియ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఊశన్న మండల కేంద్రం నుంచి వడ్యాల్‌కు వెళ్తున్నాడు. ఇదే సమయంలో రాచాపూర్ గ్రామానికి చెందిన విలాస్ పని నిమిత్తం కనకాపూర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. వడ్యాల్–రాచాపూర్ చెరువు కట్టపై వీరి బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విలాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విలాస్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిసింది. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాంగ్ రూట్‌లో వచ్చిన ఊశన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ సమీపంలో పేకాటడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విద్యానగర్‌లోని నిర్జన ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి చూడగా ఏడుగురు పేకాడుతూ కనిపించారని తెలిపారు. సిబ్బందిని చూసి ముగ్గురు అక్కడి నుంచి పారిపోగా, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.15,150 నగదుతోపాటు నాలుగు మొబైల్ ఫోన్స్, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ తరలించినట్లు వెల్లడించారు. దాడిలో ఏఎస్సై మిలీంద్‌కుమార్, కానిస్టేబుళ్లు గోపాల్, రాజేశ్, విశ్వనాథ్, కృష్ణ, హోంగార్డు రవి పాల్గొన్నారు.

వెండి పట్టీలు చోరీ

నర్సాపూర్ (జి): శనివారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిన్నవాయిన సావిత్రి శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి ఆరుబయట నిద్రించింది. ఆదివారం ఉదయం నిద్రలేచి చూడగా ఇంటి తాళం తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అందులో దాచిన ఐదు తులాల వెండి పట్ట గొలుసులు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

గంజాయి పట్టివేత

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని అర్లీ గ్రామానికి చెందిన లెండుగురె రాజు మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద ఆటో కోసం వేచి చూస్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతన్ని తనిఖీ చేయగా మూడు ప్యాకెట్లలో 250 గ్రాముల ఎండు గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.6,250 ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి రక్షణకు సాంకేతికత

- అందుబాటులోకి ఈ–లాక్డ్ హౌస్ మానిటరింగ్, యాంటీ థెఫ్ట్ అలారం
- రూపాయి ఖర్చు లేకుండా పోలీస్ సేవలు
- దొంగతనాల నివారణకు ఆధునిక పరిష్కారాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న పోలీసులు..



మంచిర్యాలక్రైం: వేసవి సెలవులు, పండగలు, వివాహ వేడుకలు లేదా విహార యాత్రల కోసం ఇళ్లకు తాళాలు వేసి బయలుదేరినప్పుడు దొంగల భయం ప్రజలను వెంటాడుతోంది. జిల్లాలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రోజుల తరబడి ఇంట్లో ఎవరూ లేకపోతే దొంగలు రెక్కీ నిర్వహించి, తాళాలు పగలగొట్టి సొమ్మును దోచుకుంటున్నారు. నగలు, నగదు ఇంట్లో దాచితే దొంగల బారిన పడతాయని, ఒంటిపై వేసుకుంటే చైన్ స్నాచర్ల భయం వేధిస్తోంది. అయితే, ఆధునిక సాంకేతికత ఈ సమస్యలకు పరిష్కారం అందిస్తోంది.

యాంటీ థెఫ్ట్ అలారం లాక్

'అంటీ థెఫ్ట్ అలారం లాక్' ఒక సమర్థవంతమైన ఎలక్ట్రానిక్ పరికరం, ఇది ఇంటి తలుపులు, కిటికీలకు అమర్చబడుతుంది. ఎవరైనా తాళం లేదా కిటికీని పగలగొట్టి చొరబడేందుకు యత్నిస్తే ఈ పరికరం 105–110 డెసిబెల్స్ తీవ్రతతో అలారం వస్తుంది. ఈ శబ్దం 100 మీటర్ల పరిధిలో వినిపించి, చోరులను భయపెడుతుంది. పొరుగువారిని అప్రమత్తం చేస్తుంది. ఈ లాక్‌లు నివాస గృహాలు, గోదాములు, షాపింగ్ మాల్స్‌లో ఉపయోగపడతాయి. ధర రూ.300– రూ.500 మధ్య ఉండి, ఆన్‌లైన్ లేదా ఎలక్ట్రానిక్ షాపుల్లో లభిస్తాయి. యూట్యూబ్‌లో వీటి వినియోగ విధానాన్ని నేర్చుకోవచ్చు.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్..

'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్'అనేది ఆధునిక యాప్ ఆధారిత సాంకేతికత. ఇది తాళం వేసిన ఇళ్లకు నిరంతర నిఘా అందిస్తుంది. సెల్‌ఫోన్ వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఊరు వెళ్లే ముందు ×పోలీస్ వాచ్× రిక్వెస్ట్ పెడితే, పోలీసులు వైఫై రూటర్‌తో కూడిన సెన్సార్ కెమెరాలను ఇంటివద్ద ఏర్పాటు చేస్తారు. విద్యుత్ అంతరాయం జరిగినా యూపీఎస్ సహాయంతో ఈ కెమెరాలు పనిచేస్తాయి. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నిస్తే, సెన్సార్ ఫొటోలు తీసి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం పంపుతుంది. నిమిషాల్లో పోలీసులు చేరుకుని దొంగలను అదుపులోకి తీసుకుంటారు. ఈ సేవ ఉచితం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉంది. తెలంగాణ పోలీసులు దీనిని త్వరలో అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



దొంగతనాల నివావరణకు ప్రజలు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి. రెండు మూడు రోజులకన్నా ఎక్కువ రోజులు ఎక్కడికైనా వెళ్లాల్సివస్తే పోలీసులకు సమచారం అందించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. యాంటీ థెఫ్ట్ లాకర్ అలారం ఏర్పాటు చేసుకుంటే మంచిది. దొంగతనానికి యత్నింగానే అలారం మోగుతోంది. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తవుతారు. దొంగలు పారిపోతారు. తాలాలు వేసి ఉన్న ఇళ్లకు ఇది రక్షణ కల్పిస్తుంది.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ

ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య అవగాహన

- సీఎం చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు అందుకున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్


సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీ, తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి కేంద్రం వీహబ్ మధ్య అవగాహన కుదిరింది. అవగాహన ఒప్పందంపై విశ్వవిద్యాలయ అధికారులు, వీహబ్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పంద ప్రతులను ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అందుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, వీహబ్ మెంటర్‌షిప్, స్కిల్స్ ట్రైనింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మద్దతు తదితర కార్యకలాపాల ద్వారా ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే దీని లక్ష్యమని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. వీహబ్‌తో సంయుక్తంగా పనిచేయడం ద్వారా గ్రామీణ విద్యార్థుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, వారి నైపుణ్యాలు పెంపొందే అవకాశాలు విస్తృతమవుతాయని పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యారంగానికి, యువత భవిష్యత్‌కు ఒక కీలక మైలురాయిగా నిలువనుందని విశ్వవిద్యాలయ అధికారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓఎస్డీ, ప్రొఫెసర్ మురళీదర్శన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మహాలక్ష్మీ, సరస్వతీ, మహాకాళీ అమ్మవార్లకు అభిషేకం, అర్చన, హారతి, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం క్యూలైన్‌లో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షరాశ్రీకార పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వాగులో దూకి ఒకరి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ సమీపాన గల వాగులో దూకి ఒకరు మృతి చెందారు. స్థానికులు, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. స్థానిక ఆదర్శనగర్ చెందిన ఎల్లయ్య (58) కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన అతడు శనివారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి సిద్దాపూర్ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

బేల: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని పోనాల గ్రామానికి చెందిన శాక్రే మహదేవ్(28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవ్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో భార్యతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఆచూకీ కోసం గాలించగా గ్రామ శివారులోని తమ చేనులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి భీంరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిర్పెల్లి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. ఆదివారం గ్రామ శివారులోని కెనాల్‌లో గ్రామస్తులకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టని స్థితిలో కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సుప్రియ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30–35 వయస్సు ఉంటుందని తెలిపారు. ఒంటిపై పసుపు, నలుపు గీతల షర్ట్, యాష్ కలర్ ప్యాంట్ ఉన్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ జోషి శ్రీవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపుతప్పి బొలెరో బోల్తా


ప్రమాదానికి గురైన బొలెరో


బాధితులను పరామర్శిస్తున్న ఎస్సై శ్రీసాయి

- వరుడిని తీసుకొస్తుండగా రోడ్డు ప్రమాదం
- 11 మందికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- సిరికొండ మండలంలో శనివారం అర్ధరాత్రి ఘటన

సిరికొండ: వివాహ ఘట్టంలో భాగంగా వరుడిని తీసుకొచ్చే క్రమంలో అర్ధరాత్రి రహదారి ప్రమాదం చోటు చేసుకుంది.. మరో ఐదు నిమిషాల్లో వధువు ఇంటికి చేరుకోవాల్సి ఉండగా మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేరడిగొండ (జి) గ్రామానికి చెందిన యువతితో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని బూసిమెట్టు గ్రామానికి చెందిన యువకుడికి పెళ్లి నిశ్చయమైంది. గురువారం వివాహం కానుంది. ఈ క్రమంలో శనివారం అమ్మాయి తరపు బంధువులు, కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి అబ్బాయితో తిరుగు పయనమయ్యారు. 30 మందితో బొలెరో వాహనంలో బయలుదేరారు. నేరడిగొండ(జి)కి కిలోమీటరు దూరంలో మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. అందులో ప్రయాణిస్తున్న 11 మందికి తీవ్ర గాయాలవగా మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఇందులో ఆర్క గంగారాం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితులను స్థానిక ఎస్సై శ్రీసాయి ఆదివారం పరామర్శించారు.

బారెగూడలో ట్రాక్టర్..

- ఒకరికి గాయాలు


బోల్తాపడిన ట్రాక్టర్

బెజ్జూర్: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బారెగూడకు చెందిన చిప్ప ఉమేష్ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఉమేష్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108లో ఆస్పత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.

పెద్దవాగు సమీపంలో ఆటో..

- నలుగురికి గాయాలు

రెబ్బెన: ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఆదివారం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ నుంచి ప్రయాణికులతో కాగజ్‌నగర్ బయలుదేరిన ఆటో పెద్దవాగు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన ఎదుల లక్ష్మి, జక్కుల పెల్లికి చెందిన మేడి శంకరమ్మ, విమలాబాయితోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న సిర్పూర్(టి) 108 ఈఎంటీ అజయ్‌కుమార్, పైలట్ అరవింద్ క్షతగాత్రులను కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గొర్రెలకు పొంచిఉన్న చిటుకు వ్యాధి

- తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డి తింటే జీవాలకు ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పశువైద్యాధికారి సతీశ్


గడ్డి మేస్తున్న గొర్రెలు


సతీశ్, వెటర్నటీ వైద్యుడు

చెన్నూర్‌రూరల్: గొర్రెలకు సోకే వ్యాధుల్లో చిటుకు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు చిటికె వేసినంత సమయంలోనే మరణిస్తాయి. ఈ వ్యాధిని నెత్తిపిడుగు, గడ్డి రోగం, పాటురోగం వంటి పేర్లతో పిలుస్తుంటారు. తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డిని ఎక్కువగా తింటే ఈ వ్యాధి సోకుతుంది. బలిష్ఠంగా పెరిగి యుక్త వయస్సులో ఉన్న గొర్రెలు ఈ వ్యాధిబారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. మేత కోసం వలస వెళ్లే గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి నివారణకు పెంపకం దారులు జాగ్రత్తలు పాటించాలని కత్తెరసాల పశువైద్యాధికారి సతీశ్ సూచిస్తున్నారు.

లేత గడ్డిని తినడంతోనే..

తొలకరి వర్షాలకు పెరిగిన లేతగడ్డిని తినడం ద్వారా క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రిన్జర్స్ టైపు–డీ రకం సూక్ష్మజీవులు జీవాల పేగుల్లో గాలిలేని వాతావరణంలో అభివృద్ధి చెందుతాయి. ఇవి వదిలిన విష పదార్థాలు చిటుకు వ్యాధికి కారణం అవుతాయి. తొలకరి వర్షాలకు పెరిగిన లేత గడ్డిని అధికంగా తిన్న గొర్రెలు ఈ వ్యాధి బారిన పడుతాయి. మే నెలాఖరు నుంచి జులై మధ్య ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు చనిపోయే ముందు ఎగిరి కిందపడి, కాళ్లు గిలగిలా కొట్టుకొంటూ, పళ్లు కొరుకుతూ, బిగుసుకొని క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోతాయి. వ్యాధి సోకిన జీవాలు మేత మేయక, నెమరు వేయక, తలలు వాల్చి ముడుచుకుని ఒకేచోట నిలబడతాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించాలి.

వ్యాధి నివారణ ఇలా..

జీవాలన్నింటికీ ఏటా ఏప్రిల్, మే నెల మధ్యలో వ్యాధి నిరోధక టీకా (మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) తప్పనిసరిగా వేయించాలి. రెండో విడత అక్టోబర్, నవంబరు మధ్యలో వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పశువైద్యుడిని సంప్రదించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని జీవాలు మేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గొర్రెలను ఉదయం కొంత ఆలస్యంగా మేతకు తీసుకెళ్లాలి. మధ్యాహ్నం కాస్త విశ్రాంతి తీసుకోనివ్వాలి. సాయంత్రం పూట ఎక్కువ సేపు ఉంచకుండా త్వరగా తీసుకు రావాలి. వ్యాధి సోకిన గొర్రెలను విడిగా ఉంచాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే గొర్రెలను చిటుకు వ్యాధి భారి నుంచి కాపాడుకోవచ్చు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఆదివారం వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతిచెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి (50) అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

గోదావరి నదిలో మహిళ..


గుర్తుతెలియని మహిళ మృతదేహం

జిల్లా కేంద్రంలోని గోదావరినదిలో మునిగి గుర్తు తెలియని మహిళ(35) మృతిచెందింది. మహిళ గ్రీన్ కలర్ టాప్, రెడ్ కలర్‌లో తెల్లని గీతలు కలిగిన పైజామా ధరించి ఉంది. ఆమెవద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి మార్చూరిలో భద్రపర్చారు. బంధువులు 8712656534, 9390560335 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గుండెపోటుతో హఠాన్మరణం


సత్యనారాయణ (ఫైల్)

కడెం: మండల కేంద్రానికి చెందిన మత్స్యకార సంఘం మండలాధ్యక్షుడు గడప సత్యనారాయణ (65) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. సత్యనారాయణ అకాల మరణంపై మత్స్యకార సంఘ నాయకులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

చెరువులో గడ్డిమందు పిచికారీ


గడ్డి మందు కారణంగా మాడిపోయిన గుర్రపుడెక్క

- డ్రోన్‌తో చల్లినట్లు చెబుతున్న స్థానికులు...
- మాడిపోయిన గుర్రపుడెక్క, తామర, అల్లిపూల ఆకులు
- విషపూరితంగా మారిన నీరు..
- ఆందోళన చెందుతున్న టీకానపల్లి గ్రామస్తులు..


విషపూరితమైన నీటిని చూపుతున్న స్థానికుడు

మంచిర్యాలరూరల్(హాజీపూర్) హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామ శివారులోని కమాన్‌కుంట(పాత చెరువు)లో ఇటీవల హాజీపూర్‌కు చెందిన కొంతమంది మత్స్యకారులు డ్రోన్ సహాయంతో గడ్డిమందును పెద్ద ఎత్తున పిచికారీ చేశారు. చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క కారణంగా చేపలు పట్టడంలో ఇబ్బందిగా మారిందని భావించి ఇలా గడ్డి మందు పిచికారీ చేసినట్ల స్థానికులు చెబుతున్నారు. అయితే, గడ్డి మందు పిచికారీ వల్ల చెరువు నీరు కలుషితమై, పరిసర పంట పొలాలు, గట్లపై గడ్డిమందు పేరుకుపోయింది. దీంతో, గట్లపై గడ్డి మేసి చెరువు నీరు తాగిన గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. చెరువు నీరు నల్లగా మారి, కలుషితమైందని స్థానిక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామస్తుల ఆందోళన..

గుర్రపుడెక్కను కూలీల ద్వారా తొలగించకుండా రసాయన మందును డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల పరిసర పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగింది. స్థానిక రజకులు బట్టలు ఉతకడానికి ఇబ్బంది పడుతున్నారు. చెరువు నీటిపై ఆధారపడే గ్రామస్తుల జీవనోపాధి, పశువుల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఈ చర్యను బాధ్యతారాహిత్యంగా భావిస్తూ, మత్స్యకారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు వెంటనే స్పందించి, గడ్డిమందు పిచికారీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చెరువు నీటి పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు


ఎంపిక పోటీలకు హాజరైన క్రికెట్ క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–25 జిల్లా ఎంపిక పోటీలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆరు టీంలుగా విభజించి, ప్రతీ టీం మిగిలిన అన్ని టీంలతో రెండు రోజులు తలపడేలా షెడ్యూల్ రూపొందించారు. అందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుగా ఎంపిక చేస్తామని హెచ్‌సీఎల్ సెక్రెటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్ తెలిపారు.